బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 07 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4

తెలంగాణ ఓటర్ల తుది జాబితా విడుదల

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో సవరించిన ఓటర్ల జాబితా ఎన్నికల సంఘం విడుదల చేసింది. సవరణ తర్వాత తుది ఓటర్ల జాబితాను సీఈవో సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. జాబితా ప్రకారం, తెలంగాణలో మొత్తంగా 3,35,27,925 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,66,41,489 మంది పురుషులు, 1,68,67,735 మంది మహిళలు, 2,829 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. వీరిలో 5,45,026 మంది 18-19 సంవత్సరాల ఓటర్లు, 2,22,091 మంది 85 ఏళ్లు దాటిన సీనియర్ ఓటర్లు, 3,591 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నారు. 5,26,993 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలో అత్యధికంగా 7,65,982 మంది, అతి తక్కువగా భద్రాచలంలో 1,54,134 మంది ఓటర్లు ఉన్నారు.

భారత్‌లోకి హెచ్ఎంపీవీ

భారత్‌లో ఐదు కేసులు గుర్తింపు బెంగళూరు,చెన్నైలో ఇద్దరు చొప్పున..అహ్మదాబాద్‌లో ఒకరికి

ఎలాంటి అంతర్జాతీయ ప్రయాణాలూ లేకుండానే సోకిన వైరస్

భయపడాల్సిన అవసరం లేదు : కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టీకరణ



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

చైనాలో వేగంగా వ్యాపిస్తున్న హ్యూమన్ మెటాన్యుమోవైరస్(హెచ్ఎంపీవీ) భారత్‌లోకి ప్రవేశించింది. దేశంలో ఐదు హెచ్ఎంపీవీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. బెంగళూరులో రెండు కేసులను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్(ఐసీఎంఆర్) గుర్తించినట్టు సోమవారం ఉదయం కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. శ్వాసకోశ వైరస్‌లపై దేశవ్యాప్తంగా చేపట్టిన సాధారణ పర్యవేక్షణలో ఈ కేసులు గుర్తించినట్టు ఐసీఎంఆర్ వెల్లడించింది. ఆ తర్వాత అహ్మదాబాద్‌లో ఒకటి, చెన్నైలో మరో రెండు కేసులు వెలుగులోకి వచ్చాయి. హెచ్ఎంపీవీ పాజిటివ్‌గా గుర్తించిన బాధితులంతా చిన్నారులే. బెంగళూరులోని బాప్టిస్ట్ హాస్పిటల్‌లో చేరిన మూడు నెలల ఆడశిశువుకు హెచ్ఎంపీవీని గుర్తించగా, ప్రస్తుతం దవాఖాన నుంచి డిశ్చార్జ్ అయి కోలుకుంటున్నది. మిగతా వారు దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. బెంగళూరులో హెచ్ఎంపీవీ బారినపడ్డ ఇద్దరు చిన్నారులు ఇటీవల బ్రాంకోన్యుమోనియాకు గురయ్యారు. బాధిత చిన్నారులు, వారి కుటుంబసభ్యులెవరూ ఇటీవలికాలంలో ఇతర ప్రాంతాలు, దేశాల్లో పర్యటించలేదని అధికార వర్గాలు గుర్తించాయి.

హెచ్ఎంపీవీ ఇప్పటికే భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్నదని, ఈ వైరస్‌తో సంబంధమున్న శ్వాసకోశ సమస్యల కేసులు అనేక దేశాల్లో నమోదవుతున్నాయని ఐసీఎంఆర్ ఒక ప్రకటనలో తెలిపింది. తమ వద్ద ఉన్న ప్రస్తుత సమాచారంతో పాటు ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్(ఐడీఎస్‌పీ) డాటా ప్రకారం చూస్తే దేశంలో ఇన్‌ఫ్లుయెంజా లాంటి అనారోగ్య సమస్యల(ఐఎల్ఐ) లేదా తీవ్ర శ్వాసకోస సమస్య(ఎస్ఏఆర్ఐ) కేసుల సంఖ్య అసాధారణంగా ఏమీ పెరగలేదని వెల్లడించింది. కాగా, హెచ్ఎంపీవీ వైరస్ కొత్తదేమీ కాదని కర్ణాటక వైద్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు పేర్కొన్నారు. బాధిత శిశువులు ఎక్కడా ప్రయాణించలేదని, కాబట్టి ఇది బయటి నుంచి వచ్చిన వైరస్ కాదని అన్నారు. చైనాలో ఉన్నది కొత్త వేరియంట్ కావొచ్చని అభిప్రాయపడ్డారు.

హెచ్ఎంపీవీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఎదురయ్యే వైద్యపరమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండేందుకు కర్ణాటక,

మిగితా 2వ పేజీలో

మోడీతో కొట్లాడి ఓల్డ్ సిటీకి మెట్రో తీసుకొచ్చా

ఆరాంఘర్ జూపార్క్ ఫ్లైఓవర్‌కు దివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు

- ఉస్మానియా ఆస్పత్రికి త్వరలో శంకుస్థాపన
- ఎంఐఎంతో కలిసి ముందుకు సాగుతాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఆరాంఘర్ జూపార్క్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీతో కొట్లాడి హైదరాబాద్ ఓల్డ్ సిటీకి మెట్రో రైలును తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆరాంఘర్-జూపార్క్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అలాగే చాంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధిలో రూ.301 కోట్లతో సీవరేజ్ ప్రాజెక్టు శంకుస్థాపన చేశారు. ఫ్లై ఓవర్‌కు దివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు పెట్టినట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడారు. మోడీతో కొట్లాడాల్సి వస్తే కొట్లాడతా.. అసదుద్దీన్‌తో కలవాల్సి వస్తే కలుస్తామని తెలిపారు. అప్పట్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో హైదరాబాద్‌లో పీవీ ఎక్స్‌ప్రెస్ అతిపెద్ద ఫ్లై ఓవర్ నిర్మించారని.. ఇప్పుడు అదే తరహాలో తెలంగాణ ఏర్పడ్డాక రెండో అతి పెద్ద ఫ్లైఓవర్ నిర్మించుకున్నట్లు వెల్లడించారు. మనకు మనమే సాటి అని చెప్పుకోవడానికి ఇదొక్కటి చాలు అనితెలిపారు.

"మీర్ ఆలం చెరువుపై కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తాం. ఓల్డ్ సిటి అభివృద్ధికి అక్బరుద్దీన్ అడిగిన పనులన్నింటికీ డబ్బులు మంజూరు చేసే బాధ్యత నాది. ఓల్డ్ సిటీలో గల్లీ గల్లీ నాకు తెలుసు. ఉస్మానియా హాస్పిటల్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తాం. గత ప్రభుత్వం శంషాబాద్‌కు మెట్రో రైలును గచ్చిబౌలి నుంచి తీసుకువెళ్లాలని ప్రతిపాదించింది.. కానీ మేము ఓల్డ్ సిటీ నుంచి మెట్రో శంషాబాద్‌కు తీసుకెళ్తున్నాం." అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గానీ, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలోగానీ హైదరాబాద్ నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో 11 కిలోమీటర్ల అత్యంత పొడవైన స్వర్ణీయ పీవీ నరసింహారావు ఫ్లైఓవర్ నిర్మితమైతే, మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 4 కిలోమీటర్ల మేర రెండో అతిపొడవైన స్వర్ణీయ డాక్టర్ మన్మోహన్ సింగ్ ఫ్లైఓవర్ ను నిర్మించామని, తద్వారా తమకు తామే పోటీ అని నిరూపించుకున్నట్టయిందన్నారు.

ఆరాంఘర్- జూపార్క్ ఫ్లైఓవర్‌కు దివంగత ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి పెరు పెడుతున్నట్లు హర్షధ్వానాల మధ్య ముఖ్యమంత్రి గారు ప్రకటించారు. "హైదరాబాద్ నగర అభివృద్ధే తెలంగాణ అభివృద్ధి. హైదరాబాద్ అభివృద్ధి కోసం రోడ్ల విస్తరణ, మెట్రో రైలు విస్తరణ, గోదావరి జలాలు తేవడం ద్వారా తాగునీటి సమస్యల పరిష్కారం, మూసీ పునరుజ్జీవం శాంతి భద్రతల పరిరక్షణ, నిరుద్యోగ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి అనేక కార్యక్రమాలు తీసుకుని ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటున్నాం.

హైదరాబాద్ నగరానికి లేక్స్ అండ్ రాక్ సిటీగా ప్రపంచంలోనే ఒక గొప్ప పేరు ఉంది. ఆనాడు నిజాం చేసిన అభివృద్ధిని పరిరక్షించుకొని ఉండుంటే ప్రపంచ చిత్రపటంలో హైదరాబాద్ తో పోటీ పడే నగరమే ఉండకపోయేది. కానీ కాలక్రమేణా కబ్జాదారులు, ఆక్రమణల వల్ల నగర సుందరీకరణ పూర్తిగా దెబ్బతిన్నది. ఈరోజు నగరంలో చిన్న వర్షం వచ్చినా వరదలు వస్తున్నాయి, ట్రాఫిక్ జామ్లు అవుతున్నాయి. వీటన్నిటిని కూడా పరిష్కరించుకోవాలనే ఆలోచనతోనే ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు. ఎన్నికల తర్వాత అభివృద్ధి గురించి మాత్రమే ఆలోచన. ఇప్పుడు హైదరాబాద్ అభివృద్ధి కోసం ఎంఐఎంతో కలిసి పనిచేస్తాం.

ఈ రోజు ప్రారంభమైన చర్లపల్లి టర్మినల్ చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. నేను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను ఒక పెద్ద రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చేసేందుకు అవసరమైన భూమి సేకరణ, ఇతర అనుమతుల పనులన్నీ పూర్తి చేశాం. చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం సందర్భంగా కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారితో మాట్లాడాను. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత 10 ఏండ్ల పాటు మెట్రో రైలు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్న విషయాన్ని గుర్తుచేశాను. ముఖ్యంగా గౌలిగూడ, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట వరకు సుమారు 7.5 కిలోమీటర్ల మెట్రో పనులు ఏకంగా ఒక్క ఇటుక కూడా వేయలేదు. అందుకే హైదరాబాద్ మెట్రో రెండో దశ కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను గురించి చెప్పి కేంద్ర మంత్రిమండలి ఆమోదించాల్సిందిగా అభ్యర్థించాను. ఔటర్ రింగ్ రోడ్‌తో పాటు, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కూడా అత్యవసరం. రీజినల్ రింగ్ రోడ్ పూర్తయితే తెలంగాణ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రీజినల్ రింగ్ రోడ్‌తో పాటు, రీజినల్ రింగ్ రైలును కూడా కేంద్రాన్ని కోరాం. వికారాబాద్ - కొడంగల్ - కృష్ణా రైల్వే లైన్ కూడా కోరాం.

తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం ఎవరితోనైనా కలుస్తా, ఎవరితోనైనా పోరాడుతా. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం నా శక్తివంతమైన కృషిని కొనసాగిస్తాను. హైదరాబాద్ నగరానికి సంబంధించి కొన్ని అంశాలపై మంత్రి శ్రీధర్ బాబు గారు ఒక డాక్యుమెంట్ తయారు చేసారు. కొద్దిరోజుల్లోనే హైదరాబాద్ ఎంఐఎం ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు సంబంధిత అధికారులతో ఒక సమావేశం నిర్వహిస్తాం. హైదరాబాద్ పాత నగరం నిజానికి ఓల్డ్ కాదు.. ఒరిజినల్ సిటీ.. ఇది అసలైన నగరం. అందుకే మా ప్రభుత్వం ఒరిజినల్ సిటీ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుంది." అని అన్నారు.

తెలంగాణ ప్రగతిలో కీలకంగా చర్లపల్లి స్టేషన్



- నాలుగు విభాగాలుగా రైల్వే అభివృద్ధి
- సోలార్ స్టేషన్‌గా చర్లపల్లికి ప్రత్యేకత
- హై స్పీడ్ రైళ్లకు పెరుగుతున్న డిమాండ్
- దేశంలో కనెక్టివిటీ కొత్త పుంతలు
- ఎయిర్‌పోర్టును తలపించేలా చర్లపల్లి రైల్వే స్టేషన్
- చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోడీ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

చర్లపల్లి రైల్వే స్టేషన్ ఓఆర్ఆర్‌కు అత్యంత సమీపంలో ఉందనీ, తెలంగాణ ప్రగతిలో ఇది అత్యంత కీలకంగా మారబోతోందని ప్రధాని మోడీ అన్నారు. సోలార్ స్టేషన్‌గా చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను అభివద్ధి చేశారని తెలిపారు. దేశ వ్యాప్తంగా హైస్పీడ్ రైళ్ల కోసం డిమాండ్ పెరుగుతోందని, టూరిజంతో పలు రాష్ట్రాలకు ఆర్థిక వృద్ధి చేకూరుతుందని అన్నారు. సోమవారం చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను వర్చువల్‌గా ప్రధాని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధునాతన, అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను వందల కోట్ల రూపాయలతో నిర్మించినట్లు చెప్పారు. రూ. 413 కోట్లతో నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను రైల్వే శాఖ నిర్మించిందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉన్న ఈ రైల్వే స్టేషన్ తెలంగాణ అభివృద్ధిలో కీలకంగా మారబోతోందన్నారు. సోలర్ స్టేషన్?గా చర్లపల్లి స్టేషన్‌ను అభివృద్ధి చేశామన్నారు.

రైల్వేకు బెంచ్ మార్క్ క్రియేట్ చేస్తున్నామని ప్రధాని మోడీ అన్నారు. మారుమూల గ్రామాలకు రైల్వే కనెక్టివిటీ కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోట్లాది మంది ప్రయాణికులను గమ్య స్థానానికి చేర్చుతున్నామని చెప్పారు. రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. రైల్వే స్టేషన్లలో మౌలిక సదుపాయలపై దృష్టి పెట్టినట్టు చెప్పారు. ఇప్పటికే 180 కిలో మీటర్ల వేగంగా పరుగులు తీస్తున్న వందే భారత్? ట్రైన్‌లో స్లీపర్లు కూడా పెడుతున్నామని చెప్పారు. ఇప్పటికే ట్రయల్ కూడా వేశామన్నారు.

పదేళ్లలో 30 వేల కిలోమీటర్ల కొత్త లైన్లను ఏర్పాటు చేశామని ప్రధాని చెప్పారు. బులెట్ ట్రైన్ల కల త్వరలో సాకరం అవుతుందన్నారు. దేశంలో 35 శాతం విద్యుధీకరణ పనులు పూర్తి చేశామన్నారు. రైల్వే ఆధునికీకరణతో దేశంలోని ముఖచిత్రమే మారుస్తోందన్నారు. నాలుగు విభాగాలుగా రైల్వేను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. దేశంలో మెట్రో సేవలు వెయ్యి కిలోమీటర్ల మైలు రాయి దాటిందన్నారు. 2001లో అయిదు నగరాలకే పరిమితమైన మెట్రో సేవలు.. ఇప్పుడు 21 నగరాలకు విస్తరించాయని తెలిపారు.

మిగితా 2వ పేజీలో

ఏసీబీ కార్యాలయం వద్ద హైడ్రామా

- లాయర్లతో ఏసీబీ ఆఫీసుకు వచ్చిన కేటీఆర్
- ఒక్కరే రావాలన్న ఏసీబీ
- లేఖ ఇచ్చి వెనుదిరిగిన కేటీఆర్
- 9న హాజరు కావాలంటూ ఏసీబీ మరో నోటీస్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసు విచారణకు సంబంధించి సోమవారం బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయం వద్ద హైడ్రామా చోటు చేసుకున్నది. విచారణకు వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తనవెంట లీగల్ టీమ్‌ను తీసుకురావటం పట్ల ఏసీబీ అధికారులు అభ్యంతరం తెలిపారు. దాంతో వారితో వాదించిన కేటీఆర్.. చివరికి ఒక లేఖను ఏసీబీ దర్యాప్తు అధికారికి అందజేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఫార్ములా ఈ-రేసు వ్యవహారం కేసులో కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో విచారణ కోసం సోమవారం ఏసీబీ ప్రధాన కార్యాలయం వద్దకు చేరుకున్నారు. . ఏసీబీ ఇచ్చిన నోటీసు మేరకు ఉదయం పది గంటల ప్రాంతంలో కేటీఆర్ తన నివాసం నుంచి ఇద్దరు న్యాయవాదులతో కలిసి బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే ఏసీబీ కార్యాలయం వద్ద అధికారులు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.న్యాయవాదితో వస్తున్న కేటీఆర్‌ను పోలీసులు అడ్డుకోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఏసీబీ కార్యాలయానికి న్యాయవాదికి అనుమతి లేదని బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్ రెడ్డి కేటీఆర్‌కు వివరించారు. న్యాయవాది అనుమతి నిరాకరణపై రాతపూర్వకంగా ఇవ్వాలని పోలీసులను మాజీ మంత్రి కేటీఆర్ కోరారు. తన వాదనను ఇప్పటికే హైకోర్టుకు వెల్లడించామని ఆయన తెలిపారు. న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసిందని ఏసీబీ అధికారులకు కేటీఆర్ వివరించారు. హైకోర్టు, చట్టాలు, రాజ్యాంగంపై గౌరవంతోనే ఏసీబీ ఆఫీస్‌కు వచ్చామని కేటీఆర్ అన్నారు. న్యాయవాదిని తీసుకెళ్లడం రాజ్యాంగపరంగా తనకు ఉన్న హక్కు అని వివరించారు. న్యాయవాదిని అనుమతించబోమని ఏసీబీ వాళ్లు చెప్పాలని కానీ పోలీసులు ఎందుకు చెబుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మీ ఒక్కరిని మాత్రమే లోనికి పంపించాలని పైఅధికారుల నుంచి ఆదేశాలున్నాయని పోలీసులు ఆయనకు స్పష్టం చేశారు.

కేటీఆర్ వెంట వచ్చిన లాయర్లు కూడా తమ క్లయింటు వెంట తాముండే అధికారమున్నదంటూ సముదాయించ బోయారు. అందుకు పోలీసు అధికారులు ససేమిరా అనటంతో అక్కడ కేటీఆర్, పోలీసు అధికారుల మధ్య కొంత స్వల్ప వాదులాట జరిగింది. దాంతో, తన వెంట లాయర్లు వస్తేనే లోనికి వెళ్తానని, లేకపోతే తిరిగి వెళ్తానంటూ కేటీఆర్ స్పష్టం చేశారు. దాదాపు అరగంటకు పైగా ఏసీబీ కార్యాలయం ప్రధాన గేట్ల వద్ద ఈ వాతావరణం కొనసాగింది.

చివరికి ఏసీబీ విచారణ అధికారి (ఐఓ) డీఎస్పీ మాజిస్ ఖాన్ పేరిట ఒక లేఖను రాసి

మిగితా 2వ పేజీలో

బీఆర్ఎస్‌కు గ్రీన్ కో కంపెనీకి మధ్య లావాదేవీలు

- ఫార్ములా కార్ రేసు కేసులో ట్విస్ట్
- సంచలన విషయాలు బయట పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో ఫార్ములా-ఈ రేస్ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా తెలంగాణ ప్రభుత్వం సంచనల విషయాన్ని బయటపెట్టింది. బీఆర్ఎస్ పార్టీకి రేస్‌లో భాగస్వామిగా ఉన్న గ్రీన్ కో కంపెనీకి మధ్య లావాదేవీలు జరిగినట్లు వెల్లడించింది. గ్రీన్‌కో దాని అనుబంధ సంస్థల నుంచి బీఆర్ఎస్ పార్టీకి 41 సార్లు ఎన్నికల బాండ్లు జారీ అయినట్లు తెలిపింది. 2020 ఏప్రిల్ 20 నుంచి అక్టోబర్ 10 మధ్య ఈ ఎన్నికల బాండ్లు జారీ అయినట్లు తెలిపారు. ఒక్కో బాండు విలువ రూ. కోటి కాగా.. 41 సార్లు కలిపి మొత్తం రూ.41 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో బీఆర్ఎస్ పార్టీకి గ్రీన్‌కో కంపెనీ నుంచి అందాయని ప్రభుత్వం తెలిపింది. దీంతో ఈ కేసు మరో ములుపు తీసుకుంది.

మందుపాతర పేలుడు.. 8 మంది జవాన్లు మృతి

- మరో డ్రైవర్ కూడా..
- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఘాతుకం..
- సుక్మా జిల్లాలో మందుపాతర పేలుడు..

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు ఘాతుకానికి తెగబడ్డారు. బీజాపూర్ జిల్లాలో జవాన్లను టార్గెట్ చేస్తూ మందుపాతర పేల్చారు. వాహనంలో జవాన్లు వెళ్తున్న క్రమంలో మందుపాతర పేల్చారు. జిల్లాలోని కుట్రు-బెద్రే రహదారిపై ఈ ఘటన జరిగింది. వాహనం డ్రైవర్‌తో సహా 9 మంది జవాన్లు, మొత్తంగా 10 మరణించారు. మరో ఐదుగురి జవాన్లకు తీవ్రగాయాలైనట్లు తెలుస్తోంది. పేలుడు సమయంలో వాహనంలో 15 మంది జవాన్లు ఉన్నారు. కూంబింగ్‌కి వెళ్లి వస్తున్న క్రమంలో ఈ పేలుడు చోటు చేసుకుంది. పేలుడు విషయాన్ని బస్తర్ ఐజీ ధ్రువీకరించారు.

అబూజ్ మడ్ ఏరియాలో మావోయిస్టుల ఏరి వేత కోసం నాలుగు జిల్లాల నుంచి గత నాలుగు రోజులుగా కూంబింగ్ కొనసాగుతుంది. కూంబింగ్ ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో మావోయిస్టులు పక్కా ప్లాన్‌తో ఎటాక్ చేశారు. బీజాపూర్ జిల్లాలో కుట్రూ పోలీస్ స్టేషన్ పరిధిలో అంబేలి గ్రామ సమీపంలో ఘటన జరిగింది. మృతి చెందిన వారు దంతేవాడ జిల్లాకు చెందిన డీఆర్‌జీ జవాన్లు ఉన్నారు. గత మూడు రోజులు బట్టి బీజాపూర్ సుక్మా దంతివాడ కాంకేర్ జిల్లాలకు సంబంధించిన భద్రతా బలగాలు అబూజ్ మడ్ ఏరియాలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. రెండు రోజుల క్రితం జరిగిన అబూజ్ మడ్ ఏరియాలో జరిగిన ఎన్కౌంటర్లో నలుగురు మృతి చెందారు. కాగా, ఇటీవల కాలంలో సైనికులు ఇంత పెద్ద సంఖ్యలో మృతి చెందటం ఇదే కావటంతో చత్తీస్గడ్ పోలీస్ యంత్రాంగం అప్రమత్తం అయింది. గత ఏడాది పోలీసుల చేతుల్లో సుమారు 260 మంది మావోయిస్టులు వరకు కూడా చనిపోయారు.

కారులో పెట్రోల్ పోసుకుని ప్రేమ జంట ఆత్మహత్య

వివరాలు 2వ పేజీలో

బాలిక సమీప బంధువు బ్లాక మెయిల్ చేయడమే కారణమని వాట్సాప్ మెసేజ్

తెలంగాణ ప్రగతిలో కీలకంగా చర్లపల్లి స్టేషన్

(మొదటి పేజీ తరువాయి)

రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న అన్నారు. కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను రైల్వే అభివృద్ధికి ఖర్చు చేస్తోందని తెలిపారు. అమృత్ భారత్ స్కీం కింద అనేక రైల్వే స్టేషన్లను రీ డెవలప్మెంట్ చేశామన్నారు. చర్లపల్లిలో రైల్వే టెర్మినల్‌గా అభివృద్ధి చేశామన్నారు. ఈ కొత్త టెర్మినల్ రావడంతో హైదరాబాద్‌లో చాలా వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయన్నారు. న్యూ ట్రైన్స్ త్వరలో ప్రారంభవుతాయని తెలిపారు.

మెట్రో విస్తరణకు సహకరించండి : సీఎం రేవంత్ రెడ్డి

రాష్ట్రంలో మెట్రో రైలు విస్తరణకు కేంద్రం సహకరించాలని ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్రం సహకరిస్తే తెలంగాణ ట్రిలియన్ ఎకామనీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్?గా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చర్లపల్లి టెర్మినల్ ప్రారంభి స్తున్నందుకు ప్రధానికి శుభాకాంక్షలు తెలిపారు. డ్రైపోర్టు ఇవ్వాలని కోరారు. ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధికి కట్టుబడ్డ కేంద్రం : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ గేమ్ చేంజర్‌గా ట్రిపుల్ ఆర్ ఉండబోతుందని చెప్పారు.

పరస్పర సహకారం అందించుకోవాలి : బండి సంజయ్

ప్రజా రవాణా వ్యవస్థ మెరుగుకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం, సహకారంతో వివిధ ప్రాజెక్టుల అమలుకు పరస్పర సహకారం అందించుకోవాలని సూచించారు. ఇప్పటి దాకా రూ.32వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం వివిధ ప్రాజెక్టుల కోసం అందించిందని తెలిపారు.

కేంద్రం ప్రత్యేక నిధులు కేటాయించాలి : మంత్రి శ్రీధర్‌బాబు

చర్లపల్లి రైల్వే టెర్మినల్ నుంచి రవాణా సదుపాయాల మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందనీ, కేంద్ర ప్రభుత్వం కూడా ఇందుకోసం ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు.

ఇది ఆదర్శ టెర్మినల్ : కేంద్ర సహాయ మంత్రి

చర్లపల్లి టెర్మినల్ దేశంలోనే అద్భుత ఆదర్శ టెర్మినల్ అని కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న అన్నారు. రాష్ట్రంలో రూ.2వేల కోట్ల నిధులతో ఆర్ఓబీ, ఆర్‌యూలను నిర్మించడానికి నిధులు విడుదల చేసిందనీ, ఇది ప్రదానమంత్రి రాష్ట్రానికి ఇచ్చిన బహుమానం అని తెలిపారు. ఇది దేశంలోనే అద్భుత ఆదర్శ టెర్మినల్ కానుందనీ, ఈ టెర్మినల్ నుంచి వివిధ ప్రాంతాలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ, కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రులు రవనీత్ సింగ్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, కీసర ఆర్డీఓ సైదులు, తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ కార్యాలయం వద్ద హైడ్రామా

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ అందజేశారు. ఈ కేసుకు సంబంధించిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో తీర్పు రిజర్వ్ చేశారనీ, దానిపై ఏ సమయంలోనైనా తీర్పును న్యాయమూర్తి వెలువరించనున్నారనీ, అయినప్పటికీ.. విచారణాధికారుల ముందు తాను హాజరు కావటానికి వచ్చానని కేటీఆర్ పేర్కొన్నారు. అలాగే, విచారణకు వచ్చే ముందు ఏసీబీ అధికారులు ఇచ్చిన నోటీసులో తనను ఎందుకు విచారణకు పిలుస్తున్నారో తెలపలేదనీ, ఆ వివరాలు తనకు అందజేయాలని సూచించారు.

లాయర్లను తీసుకు వెళ్లటం నాకున్న హక్కు : కేటీఆర్

అనంతరం అక్కడున్న మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. తన వెంట లాయర్లను తీసుకు వెళ్లటం రాజ్యాంగపరంగా తనకున్న హక్కని అన్నారు. ఒకవేళ తాను లాయర్లు లేకుండానే లోనికి వెళ్తే తానిచ్చిన స్టేట్‌మెంట్‌ను ఏసీబీ అధికారులు తారుమారు చేసి మీడియాకు లీక్ చేసే అవకాశమున్నదని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్ర పోలీసులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశంతో అరెస్టు చేసిన పట్నం నరేందర్‌రెడ్డి నుంచి విచారణలో సేకరించిన అంశాలను తారుమారు చేసి మీడియాకు తప్పుడు లీకులిచ్చారనీ, అదే పరిస్థితి మరోసారి ఇక్కడ తన విషయంలో పునరావృతమయ్యే ప్రమాదమున్నదని కేటీఆర్ ఆరోపించారు. ఇక్కడ తనను పిలిపించి తన నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు చేసే అవకాశమున్నదనీ, అక్కడ వెలుపల నుంచి తీసుకొచ్చిన పత్రాలను ఉంచి అవి తనవేనని చెప్పే ప్రమాదమున్నదని కూడా అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడి నుంచి తన లాయర్లతో సహా వెళ్లిపోయారు. ఈ వ్యవహారం సాగుతున్నంత సేపు ఏసీబీ కార్యాలయ పరిసరాల్లో స్వల్ప ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ఈ నెల 9న తమ ఎదుట విచారణకు హాజరు కావాలంటూ మరో నోటీసును ఏసీబీ అధికారులు కేటీఆర్‌కు సాయంత్రం అందజేశారు. ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించి విదేశీ కంపెనీతో చేసుకున్న ఒప్పందాలు, అందుకు హెచ్ఎండీఏ ద్వారా చెల్లించిన డబ్బులు, చెల్లింపులకు అనుసరించిన మార్గాలు తదితర అంశాలపై డాక్యుమెంట్లను, ఒప్పంద పత్రాలను ఆరోజు వెంట తీసుకురావాలని నోటీసులో కోరారు. అలాగే, వెంట లాయర్లను తీసుకురావొద్దని కూడా స్పష్టం చేశారు. విచారణకు రావటానికి మరో తేదీని సూచించాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సోమవారం సమాచారాన్ని పంపించారు.

యుఎస్‌లోని భారతీయులకు శుభవార్త

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హెచ్1బి వీసా ఉన్నవారు అమెరికాను వీడకుండానే తమ పత్రాలను రెన్యూ చేసుకునేందుకు అనుమతించే ఒక రెన్యూ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నదని న్యూఢిల్లీలోని అమెరికన్ రాయబార కార్యాలయం ప్రకటించింది. హెచ్1బి వీసాదారుల కోసం యుఎస్ ఆధారిత రెన్యువల్ కార్యక్రమం ఈ సంవత్సరమే అమలు కావచ్చు. ప్రత్యేక ఉద్యోగాల్లో ఉన్న భారతీయ సిబ్బంది అనేక మందికి ఆ కార్యక్రమం ఒక వరం కానున్నది. వారు తమ వీసాలను రెన్యూ చేయించుకోవడానికి. తిరిగి ముద్ర వేయించుకోవడానికి గాను ప్రస్తుతం స్వదేశానికి తిరిగి రావలసి వస్తోంది. యుఎస్‌లోనే హెచ్1బి వీసాల రెన్యువల్‌కు ఒక పైలట్ కార్యక్రమం విజయవంతంగా పూర్తి అయిన నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకున్నది. 'యుఎస్‌ను వీడకుండాను తమ వీసాలను రెన్యు చేసుకునేందుకు ప్రత్యేక ఉద్యోగాల్లో ఉన్న అనేక మంది భారతీయ సిబ్బందికి ఇది వీలు కల్పిస్తోంది.

కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై నేడు తీర్పు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం ఉదయం తీర్పును వెలువరించనున్నది. ఫార్ములా-ఈ రేస్‌లో ఏసీబీ కేసు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇప్పటికే హైకోర్టు ఇరువర్గాల వాదనలు విని.. తీర్పును రిజర్వ్ చేసింది. అయితే, తీర్పును వెలువరించే వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయొద్దని ఆదేశించింది. ఈ కేసులో మంగళవారం ఉదయం 10.30 గంటలకు కోర్టు తీర్పును వెల్లడించే అవకాశం ఉంది.

ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఇంటర్ బోర్డు ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువును పొడిగించింది. ఈ మేరకు తెలంగాణ ఇంటర్ బోర్డు ఓ ప్రకటన విడుదల చేసింది. ఆలస్య రుసుముతో ఇంటర్ ఫీజ్ చెల్లింపునకు డిసెంబర్ 25 చివరి తేదీ ఆఖరు కాగా ఆ తేదీని ఇంటర్ బోర్డు పొడిగించింది. రూ.2500 ఆలస్య రుసుముతో ఈ నెల 16 వరకు ఫీజ్ చెల్లించేందుకు అవకాశం కల్పించింది. కాగా, ఈ ఫీజు చెల్లింపు పొడిగింపు 1వ, 2వ సంవత్సరం విద్యార్థులతో సహా రెగ్యులర్, వొకేషనల్ విద్యార్థులకు వర్తిస్తుందని బోర్డు స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి 3 నుంచి మార్చి 25 వరకు జరగనున్న సంగతి తెలిసిందే.

9న నూతన ఇంధన విధానం ప్రకటన

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా ఇంధన విధానంతో పాటు రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి అవసరమైన అంశాలను అధ్యయనం చేసి కొత్త ఇంధన పాలసీని రూపొందించినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. పెట్టుబడులు ఆకర్షించే విధంగా జనవరి 9న నూతన ఇంధన విధానాన్ని ప్రకటించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్, ఇతర పోస్టులకు ఎంపికైన 315 మంది అభ్యర్థులకు భట్టి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. "రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధిలో ఇంధన శాఖ ప్రధాన పాత్ర పోషిస్తోంది. తెలంగాణని మిగులు విద్యుత్‌గా రాష్ట్రంగా మార్చేందుకు 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రణాళిక రూపొందించాం. జెన్ కో-సింగరేణి సంయుక్తంగా రామగుండంలో థర్మల్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నాయని" డిప్యూటీ సీఎం భట్టి అన్నారు.

భారత్‌లోకి హెచ్ఎంపీవీ

(మొదటి పేజీ తరువాయి)

మహారాష్ట్ర, ఢిల్లీ ప్రభుత్వాలు సోమవారం మార్గదర్శకాలను జారీ చేశాయి. బెంగళూరులో రెండు హెచ్ఎంపీవీ కేసుల నేపథ్యంలో 'ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉందాం' అంటూ కర్ణాటక అడ్వైజరీ జారీ చేసింది. జనం ఎక్కువ ఉన్న చోట్ల మాస్కు లు ధరించాలని ప్రజలకు సూచించింది. హెచ్ఎంపీవీ కొత్త వైరస్ కాదని, దేశంలో శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు అసాధారణంగా పెరగలేదని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు వీడియో మెసేజ్ ద్వారా సూచించారు. కాగా, హెచ్ఎంపీవీతో పాటు ఇన్‌ఫ్లూయెంజా ఏ, మైకోప్లాస్మా న్యుమోనియా, కొవిడ్-19 కేసులు వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో చైనా స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీని ప్రకటించింది. ప్రతి శీతాకాలంలో ఈ కేసులు వస్తుంటాయని, నవంబర్ నుంచి తమ దవాఖానలో మూడు హెచ్ఎంపీవీ కేసులు గుర్తించామని, ఇవన్నీ తేలికపాటి వైరస్ కేసులేనని కోల్‌కతాలోని పీర్‌లెస్ హాస్పిటల్ సీఈవో సుదీప్త మిత్ర పేర్కొన్నారు. హెచ్ఎంపీవీ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఢిల్లీ ఎయిమ్స్ ఇంటర్నల్ మెడిసిన్ అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ నీరజ్ నిశ్చల్ తెలిపారు. కొవిడ్-19తో హెచ్ఎంపీవీని పోల్చవద్దని, కొవిడ్-19 అనేది పూర్తిగా కొత్త వైరస్ అని, దానిపై పోరాడగల రోగ నిరోధక శక్తి అప్పుడు ఎవరిలో లేదని అన్నారు.

హెచ్ఎంపీవీ 2001 నుంచి ఉన్నదేనని చెప్పారు. పదేండ్ల వయసు వచ్చే నాటికి చాలావరకు పిల్లల్లో హెచ్ఎంపీవీకి వ్యతిరేకంగా పోరాడే రోగనిరోధక శక్తి అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కాగా, హెచ్ఎంపీవీకి వ్యాక్సిన్ లేకపోయినా కొవిడ్ వ్యాక్సిన్ మూడు డోసులు లేదా ఫ్లూ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో హెచ్ఎంపీవీని ఎదుర్కొనే రోగ నిరోధక శక్తి ఉంటుందని బెంగళూరులోని హెచ్‌సీజీ హాస్పిటల్ ఆంకాలజిస్ట్ విశాల్ తెలిపారు.

డిసీజ్ సర్వైలైన్స్ సిస్టమ్‌ను మరింత బలోపేతం చేయాలి : మంత్రి దామోదర రాజనర్సింహా

ఎలాంటి పరిస్థితి అయినా ఎదుర్కొ నేందుకు సిద్ధంగా ఉన్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్ఎంపీవీ వైరస్ కేసులు చైనాలో ఈ ఏడాదిలో ఎక్కువ సంఖ్యలో నమోదవుతున్నట్టు తెలిసిన నేపథ్యంలో కేంద్ర ఆరోగ్యశాఖ అధికారులతో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అధికారులు నిత్యం సమన్వయం చేసుకుంటు న్నారని చెప్పారు. డిసీజ్ సర్వైలైన్స్ సిస్టమ్‌ను మరింత బలోపేతం చేయాలనీ, అన్నిరకాల వనరులతో సిద్ధంగా ఉండాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను, జిల్లా అధికారులను అప్రమత్తం చేసినట్టు తెలిపారు. ఇతర దేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నట్టు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా నిరాధార, తప్పుడు సమాచారన్ని ప్రచారం చేస్తే, ప్రభుత్వం చాలా సీరియస్‌గా పరిగణి స్తామని హెచ్చరించారు. రాష్ట్రం లో అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటు లో ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ వైరస్ కొత్తది కాదనీ, 2001లో దీన్ని కనుగొన్నారనీ, ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తిలో ఉన్న వైరస్ అని తెలిపారు. శ్వాసకోశ వ్యవస్థపై స్వల్ప ప్రభావం చూపించే ఈ వ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మిన ప్పుడు అతని నోటి నుంచి వచ్చే తుంపర్ల ద్వారా మరొకరికి వ్యాపిస్తుందన్నారు.

కారులో పెట్రోల్ పోసుకుని ప్రేమ జంట ఆత్మహత్య

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

సమీప బంధువు బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని భయపడి ఓ ప్రేమజంట కారులోనే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి- భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జమీలపేట్‌కు చెందిన పర్వతం (శ్రీరాం(25) పోచారం మున్సిపాలిటీ నారపల్లిలో సైకిల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. తన దుకాణం పక్కన ఉండే ఓ బాలికతో పరిచయం కాగా, ఐదేండ్ల నుంచి వారు ప్రేమించు కుంటున్నారు. వీరి ప్రేమ వ్యవహారం బాలిక సమీప బంధువు మక్తాకు చెందిన చింటుకు తెలిసింది. అడిగినన్ని డబ్బులు ఇవ్వకుంటే విషయం ఇంట్లో చెబుతానని బాలికను 15 రోజుల నుంచి అతను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. అదే విషయాన్ని ఆమె శ్రీరాంకు చెప్పడంతో అతనికి రూ.లక్షా 35 వేలు ఇచ్చారు. మరిన్ని డబ్బులు కావాలని చింటు అడగ్గా వారి వద్ద డబ్బులు లేకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. దాంతో శ్రీరాం సోమవారం ఉదయం 10 గంటలకు బోడుప్పల్‌కు చెందిన స్నేహితుడు నవీన్ వద్ద ఎర్టిగా కారును అడిగి తీసుకొని బాలికతో కలిసి వెళ్లాడు. సాయంత్రం ఘనాపూర్ వద్ద ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు సమీపంలో కారులోనే పెట్రోల్ పోసుకొని ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో కారులో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి పేలుడు సంభవించింది. మంటలకు తాళలేక శ్రీరాం కారు నుంచి బయటకు పరుగుతీసి సర్వీస్ రోడ్డు ఫుట్‌పాత్‌పై కుప్పకూలి అక్కడికక్కడే మృతిచెందాడు. డోర్‌లాక్ కావడంతో బాలిక బయటకు రాలేక సజీవ దహనమైంది. కారులో మంటలు చెలరేగడాన్ని చూసిన వాహనాదారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఫైరింజన్ సహాయంతో మంటలను అదుపు లోకి తీసుకొచ్చారు. అంతకుముందు.. చింటు బ్లాక్‌మెయిల్ కారణంగానే తాము ఆత్మ హత్య చేసుకుంటున్నట్టు శ్రీరాం సూసైడ్ నోట్ రాసి బాలిక తల్లిదండ్రులకు, అతని అన్న కొడుక్కు వాట్సప్‌లో మెసేజ్ పంపించాడు. ఘటనా స్థలానికి మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి వచ్చి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హైడ్రా ప్రజావాణి స్టార్ట్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో సోమవారం మొదటి సారీ నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువలా వచ్చాయి. ప్రతి సోమవారం నిర్వహించ తలపెట్టిన ప్రజావాణిలో భాగంగా మొదటి రోజు 83 ఫిర్యాదులు వచ్చాయి. సోమవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. . వివిధ జిల్లాల నుంచీ పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో వాటిని స్వీకరించేందుకు అధికారులు నిరాకరించారు. తమ పరిధిలోకి ఆ ప్రాంతాలు రావంటూ వారిని పంపించేశారు. స్వీకరించిన 83 ఫిర్యాదులపై మూడు వారాల్లో చర్యలు తీసుకుంటామని కమిషనర్ రంగనాథ్ హామీ ఇచ్చారు.కాగా, హైదరాబాద్ నగరంలో చెరువులు, పార్కులు ఆక్రమించి భవనాలు నిర్మించారంటూ ఎక్కువ శాతం ఫిర్యాదులు అందాయి. చెరువులు, పార్కులు, రహదారుల కబ్జాలపై హైడ్రాకు అధికంగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం చరిత్రలో నిలిచిపోతుంది..

- రైతు, రైతు కూలీల సంక్షేమం కోరేది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే
- ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

బలగం టీవీ , రుద్రంగి

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమం చేపట్టిందని,దేశంలో ఎక్కడా లేని విధంగా నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబాలను ఆర్థికంగా అదుకునేందుకు ఈ కొత్త పథకం ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్ అన్నరు.సోమవారం రుద్రంగి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26వ తేదీ నుంచి అమలు చేయబోతున్న రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమాలకు ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ రైతులతో కలసి టపాసులు పేలుస్తూ, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతును రాజుగా చేయడానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సంకల్పం పెట్టుకుందని,రైతు, రైతు కూలీల సంక్షేమం కోరేది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాత్రమేనని అన్నారు.ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతులకు ఉచిత కరెంటు సంతకం పెట్టాడని,

ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించారని,మిడ్ మానేరు, శ్రీరాంసాగర్,వరద కాలువ వంటి వాటిని నిర్మించారని,గతంలోనే మన ప్రాంతంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోని, రుద్రంగి నాగారం, చందుర్తి, ఫాజిల్ నగర్ ప్రాజెక్టులను పూర్తి చేసుకున్నమని అన్నారు.కూలీలకు ఇబ్బంది తలెత్తకుండా ఆనాడు కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం అమలు చేసిందని అన్నారు.

గత ప్రభుత్వం ఏటా రైతు బందు 10 వేలు ఇస్తే, ప్రజా ప్రభుత్వం లో నేడు 12 వెలు ఇవ్వడం జరుగుతుందని,వ్యవసాయం చేసుకోవునే రైతులకు రైతు భరోసా ఇస్తున్నామని అన్నారు.

కోనుగోలు కేంద్రాలలో గత ప్రభుత్వం దోపిడీ చేసిందని,గత ప్రభుత్వం హయంలో రైతులు కోనుగోలు కేంద్రాలలో పడిగాపులు కాసే వారని,కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు అని అన్నారు.గత ప్రభుత్వం చెల్లించినట్లుగా రాళ్లు రప్పలు, రోడ్లు రహదారులకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు రైతు భరోసా వర్తించదని,వ్యవసాయ యోగ్యం కాని భూములకు మైనింగ్, కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, రహదారులు, నివాస, పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు ఉపయోగించే భూముల రైతు భరోసా వర్తించదని అన్నారు.భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి ఈ జనవరి 26 నాటికి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రిపబ్లిక్ డే ఉత్సవాలను పురస్కరించుకుని అదే రోజు నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేయడం జరుతుందని అన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేలు నగదు ఆర్థిక సాయం పంపిణీ చేస్తుందని అన్నారు.జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ఘనంగా ప్రారంభం కానుందని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా రాష్ట్రంలో 15 లక్షల కుటుంబాలు లబ్ధి పొందనున్నారని అన్నారు.భూమి లేని పేదలను ఆదుకోవాలని ప్రజా ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రక నిర్ణయం దేశానికే ఆదర్శంగా నిలుస్తోదని అన్నారు.

తుది ఓటర్ల జాబితా విడుదల..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝు

బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లాలో భారత్ ఎన్నికల సంఘం ఆదేశాలు అనుసరించి ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం 2025 లో భాగంగా 4 లక్షల 76 వేల 345 ఓటర్లతో జిల్లా తుది ఓటరు జాబితా విడుదల చేశామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో 2 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, వీటికి సంబంధించి మొత్తం 4 లక్షల 76 వేల 345 ఓటర్లతో తుది ఓటర్ జాబితా తయారు చేశామని, మహిళా ఓటర్లు 2 లక్షల 47 వేల 46 మంది , పురుష ఓటర్లు 2 లక్షల 29 వేల 352 మంది, ఇతర ఓటర్లు 37 మంది నమోదయ్యారని తెలిపారు. జిల్లాలో మొత్తం 169 సర్వీస్ ఓట్లు ఉన్నాయని తెలిపారు.

మెట్రో నిర్మాణానికి సహకరిస్తాం : ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

బలగం టీవీ , హైదరాబాద్

పాతబస్తీ వాసుల ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మెట్రో రైలు ఇప్పుడు ఆచరణలోకి రావడం ప్రశంసనీయమని, గత ముఖ్యమంత్రులు చంద్రబాబు నుంచి వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్ చేయని పనిని సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తెలిపారు. మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి చేస్తున్న కృషికి తాము సహకరిస్తామని తెలిపారు. సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి నేతృత్వంలో మెట్రో ప్రభావిత ఆస్తుల యజమానులకు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా వచ్చారు. ఎంజీబీఎస్ – చాంద్రాయణాగుట్ట మార్గంలో ప్రభావిత 34 ఆస్తులకు సంబంధించిన 41 మంది యజమానులకు రూ.20కోట్ల నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఓవైసీ మాట్లాడుతూ మెట్రో ఫేజ్ 2లో భాగంగా 6వ కారిడార్‌ను 7.5 కిలోమీటర్ల మెట్రో నిర్మాణ పనులు ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నాలుగేండ్లలో రూ. 2,741 కోట్లతో ప్రభుత్వం చేపడుతున్నట్టు తెలిపారు. మొత్తం 7.5 కిలోమీటర్ల మేరకు మెట్రో లైన్‌లో.. సాలర్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, ఆలియాబాద్, ఫలక్‌నుమాలలో చేపట్టడం జరుగుతుందన్నారు. ఓల్డ్‌సిటీ మెట్రో నిర్మాణంలో ఇండ్లు, భూములు కోల్పోయిన వారు వ్యాపారం చేసుకునేందుకు మెట్రో స్టేషన్లలో మొదటి ప్రాధాన్యత కల్పించాలని మెట్రో ఎండీని విజ్ఞప్తి చేశారు. ప్రతిపాదిత మీరాలంమండీ, చార్మినార్ స్టేషన్ల వద్ద స్కైవాక్‌లను నిర్మిస్తే పర్యాటక పరంగానే కాకుండా స్థానికులకూ సౌలభ్యంగా ఉంటుందని సూచించారు. లబ్దిదారులకు గజానికి రూ. 60 వేలు చెల్లించాల్సి ఉండగా సీఎం సూచనల మేరకు గజానికి 81 వేలు పెంచి అందించడం హర్షనీయమన్నారు.

పాతనగరంలో మెట్రో రైల్ నిర్మాణం కోసం ఆస్తులు కోల్పోయిన వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సముచితమైన రీతిలో నష్టపరిహారాన్ని చెల్లిస్తున్నామని, ఈ ప్రక్రియలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సూచనలను పరిగణలోకి తీసుకున్నామని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. మొదటి దశ కన్నా మరిన్ని సౌకర్యాలతో రెండో దశ నిర్మాణం చేపట్టనున్నామని, దీనిలో పాతనగరం రూపురేఖలు మారనున్నాయన్నారు. ఎంపీ సూచనల మేరకు మెట్రో స్టేషన్ల నుంచి చార్మినార్, లాడ్ బజార్, సాలార్ జంగ్ మ్యూజియం వంటి పర్యాటక ప్రాంతాలకు స్కైవాక్, ఫుట్ పాత్ మొదలైన అధునాతన సౌకర్యాలు సమకూరుస్తామని తెలిపారు. పాతనగరం ఇంకా అభివృద్ధి జరగాలని ముఖ్యమంత్రి ఆకాంక్ష అని, అందుకు తగ్గట్టుగా మెట్రోను పాతనగర వాసులకు అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. నాంపల్లిలో అధునాతన మల్టీ లెవెల్ పార్కింగ్ ప్రాజెక్టు కూడా వచ్చే నెలలో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, ఇది పాతనగర అభివృద్ధికి ముఖద్వారం అవుతుందని వెల్లడించారు.

టీజీఓ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

బలగం టీవీ , సిరిసిల్ల

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీ.జీ.ఓ.) 2025 నూతన సంవత్సర క్యాలెండర్ కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆవిష్కరించారు. టీజీఓ ల ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ను రూపొందించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, టీజీఓ యూనియన్ కార్యవర్గ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీఓ అధ్యక్షులు సమర సేన్ దేవానంద్, కార్యదర్శి ఎస్ డీ జబీ ఉల్లా, జిల్లా అధికారుల సంఘం (డోర్స్) అధ్యక్షులు రవీందర్ రెడ్డి,కార్యదర్శి శేషాద్రి,సహ అధ్యక్షులు జోగం రాజు, కోశాధికారి అహ్మద్ రసూల్, ఉప అధ్యక్షులు అంజి రెడ్డి, అబ్దుల్ వాజీద్, జాయింట్ సెక్రటరీలు శ్రీకాంత్, చంద్రకళ, అనిల్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాగర్, ప్రచార కార్యదర్శి వి. శ్రీధర్, క్రీడల కార్యదర్శి లక్ష్మణ్ , కార్యవర్గ సభ్యులు కవిత, వినయ్ ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే

- ఎస్పీ అఖిల్ మహాజన్
- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 21 ఫిర్యాదులు స్వీకరణ.

బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల

బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రజలను నేరుగా దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ అందులో భాగంగా ఈ రోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 21 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు,ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు.గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని అన్నారు.

వేడుకలు ఏవైనా వేదిక అంబేద్కర్ దే

బలగం టీవీ , తంగళ్లపల్లి

సీపీఐ(ఎం) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ మెంబర్ శ్రీరాముల చంద్ర పెళ్లిరోజు సందర్భంగా అంబేద్కర్ ని స్మరించుకుంటూ తంగళ్ళపల్లి మండలంలోని బద్దెనపల్లి గ్రామంలో ని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్వతంత్ర భారతావనిలో ప్రతి పౌరుని జీవితంలో జరిగే పుట్టినరోజు పెళ్లిరోజు ఏ ఇతర వేడుకలు అయినా స్వేచ్ఛగా జరుపుకుంటున్నామంటే ఆ మహనీయులు బాబా సాహెబ్ అంబేద్కర్ త్యాగ ఫలితమని తెలుసుకోవాలన్నారు. అంబేద్కర్ భారత రాజ్యాంగం రూపకర్త ప్రపంచ మేధావి సమసమాజ స్థాపన కై తపించి తన చివరి క్షణం వరకు దేశంలోని ప్రజలు మరియు ప్రాణకోటి కోసం తాను అహర్నిశలు కష్టపడి ప్రజలందరికీ స్వేచ్ఛాయుత పరమైనటువంటి భారత రాజ్యాంగన్ని అందించారన్నారు.ఈ కార్యక్రమం తో అంబేద్కర్ పై విద్వేషం చిమ్మెవారికి ఒక చెంపపెట్టు అని తెలియజేస్తున్నామన్నారు. భవిష్యత్తులో అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూడిక్యాల కనకయ్య,కోడం వేణుగోపాల్, కూచన శంకర్, సదానందం, రాపెల్లి సచిన్,అరగొండ వేణు, కారంపూరి ప్రశాంత్,వేముల పవన్ కళ్యాణ్, ఇప్పకాయల సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐర్లాండ్‌తో వన్డే సిరీస్‌కు జట్టును ప్రకటించిన బీసీసీఐ

- 15 మంది సభ్యులతో కూడిన మహిళల జట్టు
- జనవరి 10 నుంచి వన్డే సిరీస్
- మూడు వన్డేలు రాజ్‌కోట్‌లోనే..

బలగం టీవి, హైదరాబాద్

ఐర్లాండ్‌తో స్వదేశంలో జరిగే వన్డే సిరీస్‌కు భారత మహిళల జట్టును బీసీసీఐ ప్రకటించింది. మూడు వన్డేల సిరీస్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, ఫాస్ట్ బౌలర్ రేణుకా సింగ్ ఠాకూర్‌కు విశ్రాంతి ఇచ్చింది. జనవరి 10 నుంచి రాజ్‌కోట్‌లో వేదికగా జరుగనున్న వన్డే సిరీస్‌కు బీసీసీఐ సోమవారం 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. ఓపెనర్ స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించనున్నది. హర్మన్‌ప్రీత్ గాయం కారణంగా వెస్టిండ్‌తో జరిగిన తొలి రెండు టీ20ల్లో ఆడలేకపోయింది. మూడు టీ20లోకి అందుబాటులోకి వచ్చింది. ఆ తర్వాత మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లోనూ ఆడింది. గతేడాది అక్టోబర్‌లో దుబాయి వేదికగా జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో గాయపడింది. ఇక వెస్టిండిస్‌తో జరిగిన మూడు మ్యాచుల్లో పది వికెట్లు పడగొట్టిన ఫాస్ట్ బౌలర్ రేణుక ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచింది. రేణుక వెన్నుముకపై ఒత్తిడి, పగులుతో ఇబ్బందిపడుతున్నది. ఈ క్రమంలో ఐర్లాండ్ సిరీస్ ఇద్దరు ప్లేయర్లకు బీసీసీఐ విశ్రాంతి ఇచ్చింది. రేణుక గ్రైన్జారీలో సయాలీ సత్ఘరే, సైమా ఠాకూర్ బౌలింగ్ బాధ్యతలను మోయనున్నారు. ఇక మూడు వన్డేలు ఐర్లాండ్‌తో రాజ్‌కోట్ వేదికగా జరుగుతాయి. అన్ని మ్యాచులు ఉదయం 11 గంటలకు మొదలవుతాయి. తొలి వన్డే 10న, రెండో వన్డే 12న, మూడో వన్డే 15న జరుగుతుంది.

ఐర్లాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు..

స్మృతి మంధాన (కెప్టెన్), దీప్తి శర్మ (వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, ఉమా ఛెత్రి (వికెట్ కీపర్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), తేజల్ హసబ్నిస్, రాఘవి బిస్ట్, మిన్ను మణి, ప్రియా మిశ్రా, తనూజా కన్వర్, టిటాస్ సాధు, సైమా ఠాకోర్, సయాలీ సత్ఘరే.

భారత్ ఓటమికి బ్యాటింగ్ వైఫల్యమే కారణం : గంగూలీ

బలగం టీవి, హైదరాబాద్

ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా ఓటమికి బ్యాటింగ్ వైఫల్యమే కారణమని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నాడు. టెస్ట్ క్రికెట్‌లో పరుగులు చేయడం చాలా ముఖ్యమని, 170, 180 పరుగులు చేస్తే విజయాలు దక్కవన్నాడు. అలాగే ఈ ఓటమికి ఏ ఒక్కరినో నిందించలేమన్నాడు. తాజాగా ఆయన మాట్లాడుతూ 'బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా సరిగ్గా బ్యాటింగ్ చేయలేదు. టెస్ట్ క్రికెట్‌లో విజయాలు సాధించాలంటే బ్యాటింగ్ బాగా చేయాలి. ఎక్కువ పరుగులు నమోదు చేయాలి. 170, 180 పరుగులు చేస్తే విజయాలు దక్కవు. టీమిండియా 350-400 పరుగులు చేయాలి. ఈ పరాజయానికి ఏ ఒక్కరినో నిందించలేం. బ్యాటర్లంతా సమష్టిగా విఫలమయ్యారు. అందరూ రన్స్ చేయాల్సిందే. విరాట్ కోహ్లీ గొప్ప ఆటగాడు. త్వరలోనే తన బలహీతను అధిగమించి ఫామ్ అందుకుంటాడు. చివరి టెస్ట్‌కు దూరంగా ఉండటం రోహిత్ శర్మ వ్యక్తిగత నిర్ణయం. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో రోహిత్ శర్మకు బాగా తెలుసు.'అని గంగూలీ పేర్కొన్నాడు.

సంక్రాంతికి వస్తున్నాం ట్రైలర్ వచ్చేసింది

బలగం టీవి, హైదరాబాద్

అనిల్ రావిపూడి దర్శకత్వంలో టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్ హీరోగా నటిస్తున్న చిత్రం సంక్రాంతికి వస్తున్నాం . ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రం 2025 సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిజామాబాద్ లో ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ సోమవారం నిర్వహించారు. చిత్ర తారాగణం అంతా హాజరైన ఈ వేడుకలో ట్రైలర్ విడుదల చేశారు.

ఈ కిడ్నాప్ విషయం బయటకు తెలిస్తే.. అరనిమిషంలో మన ప్రభుత్వం కూలిపోతుంది. మన కోసం పనిచేసేటోడు ఒక్కడు కావాలంటూ నరేశ్ చెప్పే సంభాషణలతో మొదలైంది ట్రైలర్. ప్రతి సినిమా రిలీజ్ కి ముందు ఒక టీజర్ ఉన్నట్టు ప్రతి మగాడికి పెళ్లికి ముందు ఒక లవర్ ఉంటుంది..భర్తలతో భార్యలు హు హు అన్నారంటే ఉత్సాహంగా ఉంది రా అని అర్థమంటూ వెంకీ చెబుతున్న ఫ్యామిలీ ఆడియెన్స్‌కు కనెక్ట్ అయ్యే సంభాషణలు ఇంప్రెసివ్‌గా సాగుతున్నాయి. మొత్తానికి వెంకీ నుంచి అభిమానులు కోరుకునే అన్ని ఎలిమెంట్స్‌తో సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉండబోతుందని ట్రైలర్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రంలో పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా ఎంగేంజింగ్‌గా సాగే ఇంటర్వ్యూలు, చార్ట్ బస్టర్ పాటలు, ఇంప్రెసివ్ ప్రోమోలు.. ఇలా ప్రతీ విషయం సినిమా చుట్టూ మంచి బజ్ క్రియేట్ చేశాయి.

'ఎమర్జెన్సీ' ట్రైలర్ విడుదల

బలగం టీవి, హైదరాబాద్

స్వీయ దర్శకత్వంలో కంగనా రనౌత్ నటించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. పలుమార్లు విడుదల వాయిదా పడిన ఈ సినిమా జనవరి 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో ఎమర్జెన్సీ ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్ లో ఇందిరా గాంధీగా కంగన రనౌత్ తన నటన, హావభావాలతో ఆకట్టుకున్నారు. డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్‌తో ఇందిరాగాంధీ పాత్రలో లీనమయ్యారు. అలాగే అనుపమ్ ఖేర్ సహా ఇతర పాత్రదారులను చక్కగా చూపించారు.

ట్రైలర్ విడుదల సందర్భంగా కంగనా రనౌత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సవాళ్లతో నిండిన పొలిటికల్ డ్రామా విడుదలకు సిద్ధమైందని తెలిపారు. ఎట్టకేలకు 'ఎమర్జెన్సీ' సినిమా పెద్ద తెరపైకి రాబోతున్నందుకు సంతోషిస్తున్నానని పేర్కొన్నారు. "ఈ కథ కేవలం వివాదాస్పద నాయకురాలి గురించి మాత్రమే కాదు. ఇది ప్రస్తుత రాజకీయ అంశాలను తెలియజేస్తుంది. గణతంత్ర దినోత్సవానికి కేవలం ఒక వారం ముందు సినిమా విడుదల చేస్తున్నాము. ఈ సినిమా దేశ రాజ్యాంగం గొప్ప తనాన్ని తెలియజేస్తుంది. అలాగే మీ ప్రియమైనవారితో ఈ సినిమాను చూసేందుకు ఇదే సరైన సమయం" అని వ్యాఖ్యానించారు.

'ఎమర్జెన్సీ'లో ఇందిరా గాంధీ పాత్రలో కంగనా రనౌత్, జయప్రకాశ్ నారాయణ్‌గా అనుపమ్ ఖేర్, అటల్ బిహారీ వాజ్‌పేయీ పాత్రలో శ్రేయాస్ తల్పాడే, ఫీల్డ్ మార్షల్ శామ్ మానేక్షాగా మిలింద్ సోమన్, పుపుల్ జయకర్ పాత్రలో మహిమా చౌదరి నటించారు. జీ స్టూడియోస్, మణికర్ణిక ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించాయి.

బాహుబలి 2' రికార్డును బ్రేక్ చేసిన 'పుష్ప 2'

బలగం టీవి, హైదరాబాద్

పుష్ప 2 చిత్రం మరో రికార్డు నెలకొల్పింది. 32 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.1831 కోట్లు (గ్రాస్) రాబట్టినట్టు పుష్ప 2 టీమ్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. దాంతో రూ. 1,810 కోట్లు రాబట్టిన 'బాహుబలి-2' వసూళ్లను 'పుష్ప-2' దాటేసినట్టయింది. అలాగే కేవలం 32 రోజుల్లోనే భారతీయ సినీ చరిత్రలో ఇండియాలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా సరికొత్త రికార్డును సృష్టించింది.

ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ కాంబోలో 'పుష్ప-2: ది రూల్' రూపొందింది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్ సంస్థతో కలిసి ఈ ఇండియన్ బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ సినిమాను నిర్మించింది. రష్మిక మందన్న కథానాయికగా నటించిన ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ అద్భుతమైన బాణీలను అందించారు. విదేశీ కెమెరామన్ కూబా ఫోటోగ్రఫీ సినిమాకు వన్నెతెచ్చింది.

అత్యధిక వసూళ్లు సాధించిన ఇండియన్ మూవీస్ జాబితాలో దంగల్, పుష్ప 2, బాహుబలి 2 తర్వాత ఆర్ఆర్ఆర్ (రూ.1387o కోట్లు), కేజీయఫ్ 2 (రూ.1250o కోట్లు), కల్కి 2898 ఏడీ (రూ.1153o కోట్లు), జవాన్ (రూ.1148o కోట్లు), పఠాన్ (రూ.1050o కోట్లు) ఉన్నాయి. వీటిలో నాలుగు తెలుగు చిత్రాలుండడం విశేషం. బాహుబలి 2 ఆల్‌టైమ్ కలెక్షన్స్‌ను 32 రోజుల్లోనే పుష్ప 2 అధిగమించడం గమనార్హం. అలా వసూలు చేసిన తొలి ఇండియన్ మూవీగా నిలిచింది.

అల్లు అర్జున్‌కి మరోసారి నోటీసులు..

బలగం టీవి, హైదరాబాద్

సినీ నటుడు అల్లు అర్జున్‌కి హైదరాబాద్ రాంగోపాల్ పేట్ పోలీసులు మరోసారి నోటీసులు పంపారు. సంధ్య థియేటర్ ఘటనలో గాయపడి.. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను పరామర్శించేందుకు అల్లు అర్జున్ వెళుతున్నాడని సమాచారం అందుకున్న పోలీసులు బన్నీకి ఆదివారం నోటీసులు పంపిన సంగతి తెలిసిందే. ఈ నోటీసులలో అల్లు అర్జున్ ఆసుపత్రికి వస్తున్నాడని మాకు సమాచారం అందింది. దయచేసి మీరు ఇక్కడ రావోద్దని పోలీసులు సూచించారు. ఒకవేళ పరమర్శకు వస్తే తమ సూచనలు పాటించాలన్నారు. ఏదైనా జరిగితే అల్లు అర్జున్ బాధ్యత వహించాల్సి వస్తుందని నోటీసుల్లో పేర్కొన్నారు. దీంతో తన పర్యటనను అల్లు అర్జున్ వాయిదా వేసుకున్నట్లు తెలిసింది. ఇదిలావుంటే అల్లు అర్జున్‌కి మరోసారి నోటీసులు పంపారు రాంగోపాల్ పేట్ పోలీసులు. శ్రీతేజ్‌ను పరామర్శించాలంటే ముందుగా తమకు సమాచారం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. శ్రీతేజ్‌ని ఎప్పుడు చూడాలి అనుకున్న తమకు ముందుగానే సమచారం ఇవ్వాలని, ఆ తర్వాత మాత్రమే అక్కడికి వెళ్లాలని పోలీసులు సూచించారు.

మోహన్ బాబు పిటిషన్ పై విచారణ వాయిదా

బలగం టీవి, హైదరాబాద్

జర్నలిస్ట్ పై దాడి చేసిన ఘటనలో సినీ నటుడు మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం ఆయన తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు అంగీకరించలేదు. దీంతో, ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వయసు 78 ఏళ్లని, గుండె సంబంధిత సమస్యలతో బాధ పడుతున్నానని, తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్ లో సుప్రీంకోర్టును కోరారు. ఈ పిటిషన్ ను జస్టిస్ సుధాంశు దులియా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాల బెంచ్ విచారించింది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి అందుబాటులో లేకపోవడంతో మోహన్ బాబు తరపు న్యాయవాది పాస్ ఓవర్ కోరారు. దీనికి అంగీకరించిన సుప్రీంకోర్టు విచారణను వాయిదా వేసింది. వచ్చే గురువారం విచారణ చేస్తామని వెల్లడించింది.